జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త. కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 4-1-2025 | ఎడిటర్: చౌదరి ప్రమోద్ కుమార్ | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 209 పేజీలు: 4 వెల : రూ.7

# వీఆర్.. కే.. ఎందుకు?



* ఇటీవల బదిలీ అయిన ఎస్ఐల్లో అధికమంది వేకెన్సీ రిజర్వుకే పరిమితం
* ప్రజాప్రతినిధుల ఒత్తిడా? మరేమైనా కారణమా?
* నిజాయితీగా ఉండడం వల్లేనంటున్న కొందరు ఎస్ఐలు
* గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగడం వల్లేనంటున్న మరికొందరు
* కారణమేంటో ఆ పెరుమాళ్‌కే ఎరుక

**శ్రీకాకుళం క్రైం, జనవరి 3 (వార్త):** జిల్లాలో గత మూడు నాలుగు నెలల నుంచి ఎస్ఐలు, సీఐలకు బదిలీ అవుతునే ఉంది. ఒకటి రెండు మినహా అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి ఎస్ఐలు బదిలీ అయ్యారు. అయితే బదిలీ అయిన వారిలో ఎక్కువ మంది వేకెంట్ రిజర్వు (వీఆర్)కే పరిమితమయ్యారు. దీనివెనుక జిల్లావాసుల్లో అనేక సందేహాలు నెలకొన్నాయి. కొందరు ఎస్ఐలు, సీఐలు అక్రమాలకు పాల్పడ్డారా? లేకుంటే ప్రజాప్రతినిధుల మాట వినలేదా? గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నేతలు, ఎమ్మెల్యేలు ఫిర్యాదుతో ఎస్ఐలకు బదిలీ చేయడంతో పాటు వీఆర్‌లో పెట్టారా అన్న ప్రశ్నలు జిల్లావాసుల్లో నెలకొంది. వైసీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో కొందరు ఎస్ఐలు మితిమీరి ప్రవర్తించిన దాఖలాలు కూడా జిల్లాలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. వైసీపీ నేతలు చెప్పినదానికి కొందరు తలలు ఊపుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలపై జులూం ప్రదర్శించడం, కేసులు పెట్టడం వంటి ఘటనలు కూడా లేకపోలేదని అప్పట్లో సర్వత్రా విమర్శలు కూడా వినిపించాయి. కొందరు ఎస్ఐలు వీఆర్‌లో ఉన్నా మళ్లీ టీడీపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆ శాఖ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి మళ్లీ పోలీస్‌స్టేషన్లకు పోస్టింగులు వేసుకున్నారన్న గుసగుసలు కూడా వినిపించాయి. కాగా, ఆమదాలవలస, సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్లకు కొత్తగా ఎస్సైలు నియమిస్తూ పోలీసు ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సరుబుజ్జిలి ఎస్సైగా బి.హైమావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె వీఆర్‌లో ఉండి, సరుబుజ్జిలిగా బదిలీపై వచ్చారు. ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్‌కు వీఆర్‌కు పంపించేశారు. సరుబుజ్జిలి ఎస్ఐగా ఉన్న ఎస్.బాలరాజుకు ఆమదాలవలసకు బదిలీ అయింది.



# పచ్చపైత్యం

* ఎంపీటీసీపై టీడీపీ నేత గూండాగిరి * నౌపడ గ్రామసభలో ఘటన * పోలీసులకు ఎంపీటీసీ ఫిర్యాదు



**సంతబొమ్మాళి, జనవరి3 (వార్త):** ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులపై టీడీపీ నాయకులు దాడులు చేయడం, చులకనగా మాట్లాడడం జిల్లాలో ఇటీవల హెచ్చుమీరింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో పచ్చ పైత్యం ఎక్కువ కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఇటువంటి ఘటనలు చెడ్డపేరు తీసుకువస్తున్నాయి. వివరాల్లోకివెళితే.. సంతబొమ్మాళి మండలం నౌపడ సచివాలయంలో పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు, నిధులు వినియోగం, ఖర్చులపై గ్రామసభ నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి ఉమాపతి స్థానిక ఎంపీటీసీ బచ్చల సుధాకర్, వైస్ సర్పంచ్ వాడరేవు రవికుమార్‌కు ఆహ్వానం పలికారు. దీంతో వీరిద్దరూ శుక్రవారం జరిగే గ్రామసభకు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులుగా పలు సమస్యలపై అధికారులను ఎంపీటీసీ సుధాకర్ ప్రశ్నించారు. ప్రజలు మీకు సమస్యలు చెప్పడానికి వస్తే ఫలానా టీడీపీ నాయకుడి దగ్గరికి వెళ్ళండి మీ పని అవుతుందని చెప్పడం ఎంతవరకు సమంజసమని సచివాలయ సిబ్బందిని నిలదీశారు. దీంతో పక్కన ఉన్న టీడీపీ నాయకుడు వాడరేవు కృష్ణారావు జోక్యం చేసుకొని అధికారంలో ఉన్నది మేము .. మాకు వచ్చి ప్రజలు సమస్యలు చెబుతున్నారని అంటూనే.. మీకు ఇక్కడ కూర్చో పెట్టడమే గొప్ప అంటూ చులకనగా మాట్లాడి చిందులు తొక్కారు. ప్రజా ప్రతినిధిగా ఇక్కడకు గ్రామ సభకు పిలిస్తే వచ్చామని ఎంపీటీసీ సమాధానం చెప్పారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంలో ఎంపీటీసీపై కృష్ణారావు దాడి చేశారు. దీంతో గ్రామసభ రసాభాసగా మారింది. విషయం తెలియడంతో నౌపడ ఎస్ఐ నారాయణస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన ఎంపీటీసీ సుధాకర్‌ను 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎంపీటీసీ సుధాకర్ తనపై జరిగిన దాడిని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఇటుకల బట్టీల జీవోలో ఏముంది?

* రూల్స్ పాటిస్తే ఒక్క బట్టీ కూడా నిలవదా?
* మూడు బట్టీలు ఆరు చిమ్నీల్లా సాగుతున్న వ్యాపారం
* మూడు నెలలు కష్ట పడితే ఏడాది ఆదాయం
* నిబంధనలు పాటించకుండా బట్టీల నిర్వహణ
* కొందరు అధికారులకు మామూళ్లు



5లో

## విద్యార్థులను.. సొంత బిడ్డల్లా.. చూసుకోండి

* ఎమ్మెల్యే కూన రవికుమార్
* విద్యార్థుల బోధన సామర్థ్యం పరిశీలన
* హైస్కూల్, కళాశాలల సందర్శన



5లో

## పండుగలా.. రథసప్తమి వేడుకలు

* అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేద్దాం * జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే సాంస్కృతిక కార్యక్రమాలు * జిల్లాలోని అన్ని స్కూళ్లలో సూర్య నమస్కారాలు * శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ * రథసప్తమి లోగో రూపకల్పనకు ఆహ్వానం: కలెక్టర్ * భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ట బందోబస్తు:ఎస్పీ

## నేడు పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

**పోలాకి, జనవరి 3(వార్త):** పోలాకి మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

పల్లె పండుగ సందర్భంగా ఉదయం 8:30 గంటలకు తలసముద్రం పంచాయతీ కొల్లివలస నుంచి మబగాం గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణానికి కొల్లివలస వద్ద శంకుస్థాపన చేయనున్నారు.

9:30 గంటలకు బార్జిపాడు నుంచి రహిమాన్‌పురం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి, 10:30 గంటలకు తెల్లవానిపేట నుంచి కాకినాడపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రియాగ్రహారం, 12:30 గంటలకు పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రారంభిస్తారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల ప్రతిభ వెలికితీత

### -జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



**శ్రీకాకుళం, జనవరి 3(వార్త):** జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శుక్ర వారం ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన గ్యాస్ లీకేజీ డిటెక్షన్, మైక్రో ఆల్గే టెక్నాలజీ, సర్వైలెన్స్ కారు ప్రాజెక్టులను ఆయన పరిశీలించి, వారిని ప్రశం సించారు. ఈ ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభ వెలికి తీతకు దోహదపడతాయన్నారు. జిల్లా స్థాయిలో 93 ప్రాజెక్టులు ప్రదర్శిం చగా, వీటిలో ఉత్తమమైన ఆరు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి పంపుతామని జిల్లా సైన్స్ అధికారి కుమార స్వామి తెలిపారు. కార్యక్రమంలో డీఈవో తిరుమల చైతన్య, సమగ్ర శిక్ష ఏపీసీ శశిభూషణ్‌రావు, డిప్యూటీ డీఈవోలు ఆర్.విజయ కుమారి, విలియమ్స్ పాల్గొన్నారు.

### ప్రతిభ చూపిన పలాస విద్యార్థి జస్వంత్ పాత్రో



**పలాస, జనవరి 3(వార్త):** జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జస్వంత్ పాత్రో, గైడ్ టీచర్ జినగ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన రీజనరేటివ్ బ్రేకింగ్ సిస్టం ప్రాజెక్టుకు వ్యక్తిగత విభాగంలో ప్రథమ స్థానం లభించింది. విజేతకు సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖ అధికారులు విజయకుమారి, విలియమ్స్ బహుమతి ప్రదానం చేశారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం డి.దాశరథి, పాఠశాల యాజమాన్య కమిటీ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

### సత్తా చాటిన దీపక్‌కుమార్

**ఇచ్ఛాపురం, జనవరి 3(వార్త):** పురుషోత్తపురం ఆదర్శ పాఠశాల విద్యార్థి పాండవ దీపక్‌కుమార్ జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించారు. ఆ విద్యార్థి రూపొందించిన లిక్విడ్ ట్రీ ప్రదర్శనకు సందర్శకుల ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా దీపక్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ దుంపల వైకుంఠరావు, సైన్స్ సిబ్బందిని ఎంఈవో కూర్మాన అప్పారావు అభినందించారు.



## మధ్యాహ్న భోజన పథకానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

### -టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

**మెళియాపుట్టి, జనవరి 3(వార్త):** కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి లోపాలు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన మెళియాపుట్టిలోని ఎస్.డి.ఆర్.ఆర్.ఎం. ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు భోజనాలు చేయనున్న వరండాను పరిశీలించారు. డ్రింకింగ్ వాటర్‌ప్లాంట్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారనే తదితర వివరా



లు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధ్యాపకుడు బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకుల సైతం భోజనాలు చేయాలన్నారు. కళాశాల మైదానాన్ని బాగు చేయాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ పైడి పద్మావతి, డీటీ రాము, ఎంఈవో మల్లారెడ్డి పద్మనాభరావు, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు ఇ.మాధవరావు, సంజయ్ కుమార్ నాయక్, ఎస్.భాస్కరరావు, టి.మాధురిదేవి, ఎన్.సంతోష్‌కుమార్, పి.రోజా, వై.కృష్ణకుమారి, ఎస్.నళినికుమారి, వీఆర్వో సోమేశ్వరరావు, కార్యదర్శి చింతల అప్పారావు, ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా

**శ్రీకాకుళం, జనవరి 3(వార్త):** కాకినాడలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి క్యాడెట్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-17 విభాగంలో బాల, బాలికల కేటగిరీల్లో ప్రతిభ కనబరిచారు. బాలుర కేటగిరిలో ఫాయిల్ టీం విభాగంలో పిల్ల సునీల్, కె.దుర్గాప్రసాద్, సిమ్మ యశ్వంత్, బొక్కెల హర్ష కాంస్య పతకాలు సాధించారు. సాబర్ టీం విభాగంలో పీస హర్షిత్ రామ్ చరణ్, కోంద్రు హేమ సుందర్, వజ్రపతి రాజేష్‌కు కాంస్య పతకాలు దక్కాయి. ఇప్పి టీం బాలికల విభాగంలో ధనాల జోష్ని, రోషిత, దుర్గ భవాని, రాజేశ్వరికి వెండి పతకాలు లభించాయి. వీరిని శ్రీకాకుళం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా శుక్రవారం అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. వీరి కోచ్ జోగిపాటి వంశీ అభినందించారు. మరింత మంది ఫెన్సింగ్ క్రీడాకారులను జిల్లా నుంచి తయారు చేయాలని సూచించారు.




## దేశం గర్వించే స్థాయికి క్రీడాకారులు ఎదగాలి

### -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**పోలాకి, జనవరి 3(వార్త):** విద్యతో పాటు క్రీడల్లో కూడా దేశం గర్వించేలా క్రీడాకారులు రాణించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆకాంక్షించారు. మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రిగ్స్ పోటీలను శుక్రవారం ఆయన క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. క్రీడాకారులు లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో రాణించాలన్నారు. పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు.

కార్యక్ర మంలో పోలాకి నీటి సంఘం అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, నరసన్నపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అన్ని పాఠశాలల వ్యాయామ ఉపా ధ్యాయులు, విద్యార్థులు క్రీడాకారులు పాల్గొన్నారు.





## ఏపీజేఏసీ అమరావతి క్యాలెండర్ ఆవిష్కరణ

**శ్రీకాకుళం, జనవరి 3(వార్త):** రెవెన్యూ డైరీ, క్యాలెండర్, ఏపీజేఏసీ అమరావతి క్యాలెండర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, కలెక్టరేట్ ఏవో జీఏ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు, ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ కె.శ్రీరాములు, మహిళా విభాగం చైర్మన్ కె.ప్రవల్లిక ప్రియ, జిల్లా కార్యదర్శి బీవీవీఎన్ రాజు, ట్రెజరర్ మురళీధర్ నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎస్.దిలీప్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అభినందించిన ఆర్జీయూకేటీ డైరెక్టర్



**ఎచ్చెర్ల, జనవరి 3(వార్త):** కేంద్ర యువజన సర్వీసుల శాఖ నిర్వహించిన యువజనోత్సవాల్లో రాష్ట్ర స్థాయి జానపద గీతాల(సోలో) పోటీల విజేత, ఆర్జీయూకేటీ విద్యార్థిని సూర్నిడి శిరీషను డైరెక్టర్ కొక్కిరాల వెంకట ధన బాలాజీ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి పాల్గొన్నారు.

## జలధౌతితో శీతాకాల వ్యాధుల నివారణ



**శ్రీకాకుళం, జనవరి 3(వార్త):** శీతాకాలపు వ్యాధులపై దృష్టి సారించాలని ఆర్జీయూకేటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.జి.ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఆ క్యాంపస్‌లో జలధౌతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరక్కాయ పొడి, వేప, తులసి ఆకులతో తయారు చేసిన జలధౌతితో శీతాకాల సంబంధిత వ్యాధులను నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో డైరక్టర్ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డా.పెద్దింటి ముకుందరావు, యోగా శిక్షకులు అర్చన, నర్ల సతీష్ కుమార్, డా.జి.రమేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి

**వంగర, జనవరి 3(వార్త):** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభలు ఈనెల 5, 6,7,8 తేదీల్లో కాకినాడలో జరగనున్నాయి. ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ నేతలు కోరారు. శుక్రవారం వారు ఆ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి, అనేక మంది రాజకీయ, సామాజిక ఉద్యమ నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలకు వంగర మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో విచ్చేయాలని వారు కోరారు. అనంతరం ఈ మహాసభలకు రావాలని వంగర మండల విద్యాశాఖ అధికారి-1 పి.ప్రవీణ్ కుమార్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఎం.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెంకి గౌరీశంకరరావు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## జిల్లాలో 107 డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జనవరి 3(వార్త):** జిల్లాలో 107 డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. సాయి ప్రత్యూష తెలిపారు. శుక్రవారం ఆమె ఆ పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తుదారుడు ఇంటర్ ఉత్తీర్ణుడై, 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 23 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తుకు అన్ని ధ్రువపత్రాలు జత చేసి, గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి, నిర్ణీత రుసుము రూ.600ల డీడీ చెల్లించాలని సూచించారు. దరఖాస్తు పత్రాల పరిశీలన అనంతరం ఈనెల 31న హాల్ టిక్కెట్లు జారీ చేస్తామన్నారు. ఫిబ్రవరి 2న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), శ్రీకాకుళంలో రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. అందులో అర్హత సాధించిన వారికీ అదే నెల 9న ఆర్డీవో కార్యాలయములో ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేస్తామని తెలిపారు.



## నర్సిపురం సమస్యలు పరిష్కరిస్తా

**పలాస, జనవరి 3(వార్త):** నర్సిపురం గ్రామ సమస్యలు తక్షణమే పరిష్కరిస్తానని పలాస ఎమ్మెల్యే గౌత శిరీష గ్రామస్తులకు హామీ ఇచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డ్ నర్సిపురం కాలనీలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. వారం రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తానని, సీసీ రోడ్లు కూడా త్వరలో ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, సప్ప నవీను, సవర రాంబాబు, పుట్ట లోకనాథం, జగన్నాథం, కార్యకర్తలు ఉన్నారు.

## బెల్లం ఊట, సారా ధ్వంసం



**మెళియాపుట్టి, జనవరి 3(వార్త):** ఎగువ బగడ గ్రామంలో 900 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలు, 10 లీటర్ల సారాని ధ్వంసం చేసినట్లు టెక్కలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మీరా సాహెబ్ తెలిపారు. శుక్రవారం ఆ గ్రామంలో దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో టెక్కలి, పాతపట్నం ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు, మెళియాపుట్టి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పలాసలో రక్తపింజరి కలకలం



**పలాస, జనవరి 3(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల శివాజీ నగర్‌లో రక్త పింజరి సంచారం కలకలం రేపింది. ఓ ఇంటి ఆవరణలోకి దూరిన రక్తపింజరి పామును చూసిన మహిళలు భయంతో పరుగులు తీశారు. వెంటనే కాశీబుగ్గ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం అందు కున్న అటవీశాఖ అధికారులు స్నేక్ క్యాచర్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకు న్నారు. ఆ పామును పట్టుకున్న ఈస్ట్రన్ గాట్ వైల్డ్ లైఫ్ సొసైటీకి చెందిన స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడి పలాస సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

## ఎమ్మెల్యే శిరీషతో జనసేన జిల్లా కార్యదర్శి భేటీ

**మందస, జనవరి 3(వార్త):** జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని కొన్ని విషయాలను ఆమెకు వివరించినట్టు భాస్కరరావు చెప్పారు. జనసేన కార్యకర్తలకు ఎవరికి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామని ఎమ్మెల్యే చెప్పారని ఆయన తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు పైల నాగార్జున, పిన్నింటి వాసుదేవరావు, పందిరి నీలయ్య, ఇంటెనుక ఆనందరావు, హనుమంతు జనార్దన్, పైల ప్రదీప్ తదితరులు ఉన్నారు.



# రథసప్తమిని విజయవంతం చేద్దాం

**-జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేలా సాంస్కృతిక కార్యక్రమాలు**

**- ఎమ్మెల్యే గొండు శంకర్**



**శ్రీకాకుళం, జనవరి 3(వార్త):** అందరి భాగస్వామ్యంతో రథసప్తమిని విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రథసప్తమి వేడుకల నిర్వహణపై వివిధ స్వచ్ఛంద సంస్థలు, భక్తుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథసప్తమిని రాష్ట్ర పండుగగా గుర్తించి, నిధులు కూడా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ వేడుకల్లో జిల్లా సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నగర ప్రజలంతా లైటింగ్, డెకరేషన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. సామూహిక సూర్య నమస్కారాలు ఫిబ్రవరి 2న 80 అడుగుల రోడ్డులో ఉదయం 8 గంటలకు జరుగుతాయని, ఆరోజు 80 అడుగుల రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రిస్తామని తెలిపారు. మున్సిపల్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్, రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. టూరిజం హెలీకాప్టర్, లేజర్ షో ఉంటాయన్నారు. ఉచిత పాసుల జారీ ఉండదన్నారు. స్వచ్ఛంద సంస్థల వారు డీఆర్‌వోను కలిస్తే స్థలం కేటాయిస్తారని తెలిపారు. దాతలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అరసవల్లి గ్రామస్తులకు ఉచిత దర్శనానికి ప్రతిపాదించామన్నారు. వాహనాలు ఎక్కడైతే ఆగుతాయో అక్కడ నుంచి బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. వేడుకల ప్రోమో విడుదల చేస్తామని తెలిపారు. డివిజనల్ పౌర సంబంధాల అధికారి నత్తల రాజు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులు, రైళ్లపై పోస్టర్ల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేడుకల్లో అందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉప కలెక్టర్ పద్మావతి, ఈవో భద్రాజీ, కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, రెడ్‌క్రాస్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### సేవకు ముందుకు వచ్చిన స్వచ్ఛందసంస్థలు

బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షుడు ప్రసాదరావు మాట్లాడుతూ ఉత్సవాల్లో ప్లాస్టిక్‌ను నిషేధించాలని, మహిళలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. 5 వేల మందికి ఆర్గానిక్ బెల్లంతో తయారుచేసిన క్షీర పాయసం, పులిహోర తమ సంస్థ తరఫున ఏర్పాటు చేస్తామ న్నారు. జిల్లాలోని ఆలయాలు, పర్యాటక ప్రాంతాల నమూనాలు ఏర్పాటు చేయాలని ఆర్ట్స్ సంస్థ అధ్యక్షుడు ఎన్.సన్యాసిరావు సూచించగా, స్పందించిన ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవాలయాల నమూనాలు ఏర్పాటు చేస్తామన్నారు. లయన్స్ క్లబ్ వారు అంబులెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. చెప్పుల స్టాండ్‌ల సంఘరాకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. వలంటీర్లను సమకూరుస్తామన్నారు.



## సామాన్య భక్తులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం

**-వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం**

**-అరసవిల్లిలో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ఎస్పీ**

**శ్రీకాకుళం, జనవరి 3(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఏర్పాట్లను ఎమ్మెల్యే గొండు శంకర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆలయ భౌగోళిక మ్యాప్, దేవస్థానం పరిసరాలను క్షుణ్నంగా పరిశీలించి, అధికారులతో చర్చించారు. ప్రధాన సింహద్వారం, దర్శన మార్గాలు, క్యూ లైన్లు, ప్రవేశద్వారం, మండపం, ఇంద్రపుష్కరణి, ఉచిత దర్శన మార్గం, ప్రసాదం కౌంటర్లు, కేశఖండన తదితర ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ సామాన్య భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. వాహనాల పార్కింగ్, భక్తుల పాదరక్షలు భద్రపరచడానికి ప్రత్యేక స్థలం కేటాయిస్తామన్నారు. వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీరి వెంట ఆలయ ఈవో భద్రాజీ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు, పోలీస్, దేవదాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఉన్నారు.

## పటిష్ట బందోబస్తుకు ప్రణాళిక సిద్ధం చేయండి

**శ్రీకాకుళం, జనవరి 3(వార్త):** రథసప్తమి వేడుకల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ట బందోబస్తుకు ప్రణాళిక తయారు చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన ఈ వేడుకల బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎక్కడెక్కడ..ఎంతమంది బందోబస్తు అవసరమో అధికారులతో చర్చించారు. క్యూలైన్లు, ప్రవేశ మార్గాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులకు ఏ ఇబ్బందులు లేకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. పుష్కరిణి పరిసరాల్లో అవసరమైన సిబ్బందిని కేటాయించాలన్నారు. ఆయన వెంట శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఈవో భద్రాజీ, సీఐలు పైడిపు నాయుడు, ఈశ్వరరావు, నాగరాజు, ఎస్ఐ హరికృష్ణ, ఆలయ అధికారులు, అర్చకులు ఉన్నారు.



## డీవీఎంసీ సభ్యుడు గణపతికి సన్మానం



**వంగర, జనవరి 3(వార్త):** విజయనగరం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యుడిగా నియమితుడైన మజ్జి గణపతిని శుక్రవారం పలువురు ఉద్యోగులు, దళిత బహుజన సంఘాల జేఏసీ నేతలు వంగర మండల పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో-1 పి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు గణపతి చేస్తున్న సేవలు ఎనలేనివని, ఆయన డీవీఎంసీ సభ్యుడిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి రామారావు మాట్లాడుతూ కొనేళ్ల నుంచి గణపతి ప్రజా సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం మజ్జి గణపతి మాట్లాడుతూ తనకు జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, టీడీపీ సీనియర్ నేత కోండ్రు జగదీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దళిత, బహుజనుల కోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ, దళితసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గణపతిరావు, ఇంగ్లీష్ రచయిత సూర జయకృష్ణ, దళిత, బహుజన నేతలు జయకృష్ణ, గంగులు బుజ్జి, మన్మధరావు, దర్రు రాంబాబు. ఎజ్జల అప్పలస్వామి, రామారావు, శిర్లి రాజు, జి.గణపతి, చిన్న, సుధీర్, టి.సింహాచలం, రాంబాబు, దివాకర్, దాలి రాము, రమేష్, ఎజ్జల అప్పలరాము, సాయి, చంటి, ఎలగాడ సింహాచలం, పోలీసు, దళిత, బహుజన నాయకులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ

**పలాస, జనవరి 3(వార్త):** చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పలాస మండలం, మున్సిపాలిటీ వాసులకు కాశీబుగ్గ పోలీసు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటప్పారావు ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా పేకాట, గుండాట, కోడిపందాలు లాంటివి ఆడితే, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పండగ సందర్భంగా ఎవరైనా తన స్వగ్రామం వెళ్లే యెడల వారు విలువైన బంగారు ఆభరణాలు లాకర్లో భద్రపరచాలని, లేదంటే తమ వెంట గానీ తీసుకెళ్లాలని సూచించారు. చిన్నపిల్లలకు వాహనాలను ఇచ్చే తల్లిదండ్రులు, మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు ఎవరైనా అమ్మినా, సేవించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసు వారికి ఏదైనా సమాచారం తెలియ జేయాలనుకున్నవారు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ సీఐ నెంబరు 6309990825, కాశీబుగ్గ డీఎస్పీ నెంబర్ 630999 0805 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## కుక్కల దాడి..నక్క పిల్లకు గాయాలు

**పలాస, జనవరి 3 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నర్సిపురం కాలనీలో శుక్రవారం కుక్కల దాడి చేయడంతో నక్క పిల్ల గాయాల పాలైంది. ఆ కాలనీ పక్కనున్న పొలాల్లోకి ఓ నక్క..తన పిల్లలతో రాగా, కుక్కల కంట పడింది. దీంతో అవి వెంటపడి తరిమేశాయి. ఓ పిల్ల కుక్కలకు దొరికిపోవడంతో అవి కరిచేయగా, గాయపడింది. ఆ కుక్కలను చెదరగొట్టి స్థానికులు నక్క పిల్లను కాపాడి, కాశీబుగ్గ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు రాజు, కృష్ణారావు, ఈస్టన్ గార్డ్ వైల్డ్ లైఫ్ సొసైటీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ లోక్‌నాథ్, స్నేక్ క్యాచర్ ఓం కార్ త్యాడి తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన నక్కపిల్లకు సపర్యలు చేసి, కోసంగిపురం సమీపంలోని మెండో ఫారెస్ట్‌లోకి వారు విడిచిపెట్టారు.





## సావిత్రీభాయి పూలే సేవలు మరువలేనివి

**మందస, జనవరి 3(వార్త):** సావిత్రీబాయి పూలే మహిళల విద్యాభివృద్ధి కోసం విశేష కృషి చేశారని పలువురు వక్తలు అన్నారు. భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే జయంతి, జాతీయ మహిళా దినోత్సవాన్ని హరిపురం ఉన్నత పాఠశాల ప్లస్‌లో యూటీఎఫ్ మందస శాఖ సహాధ్యక్షుడు ప్రియాంక మహారాణా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వై.అరుణశ్రీ, ఎ.సీతమ్మ, ఎన్.తారకేశ్వరరావు..సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, పితృ స్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం ఆమె పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, జిల్లా అకడమిక్ సెల్ కో కన్వీనర్ కంచరాన మాధవరావు, గౌరవ అధ్యక్షుడు జన్ని సోమేశ్వరరావు, సహాధ్యక్షుడు గంట గోపాలకృష్ణ, సీపీఎస్ కన్వీనర్ దూగాన మాధవరావు, జిల్లా పూర్వపు కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, మందస మండలం పూర్వ ప్రధాన కార్యదర్శులు పిన్నింటి కొండలరావు, సార భాస్కరరావు, జిల్లా కౌన్సిలర్లు పి.జగన్మోహనరావు, గున్న రాజు, ధర్మాపు కిరణ్, తరిణి సోమేశ్వరరావు, జడ్పీహెచ్ హైస్కూల్ ప్లస్ హరిపురం ఇన్‌చార్జి మార్పు చక్రధర్‌రావు, పీజీటీ రమణ బాబు, అపోటా నాయకులు అరుణ్ కుమార్ పాడి, నందిగాం అశోక్ కుమార్, ఆర్.గోవిందు, సారి ప్రేమ్‌కుమార్, సంతోష్ కుమార్ పండ తదితరులు పాల్గొన్నారు. మహిళల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే ఎంతో కృషి చేశారని కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు గవ్వ భీమారావు అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు వై.పార్వతి, టి.జ్యోతి, ఎస్.హారికను ఘనంగా సత్కరించారు. సావిత్రీభాయి పూలే వేషధారణలో 9వ తరగతి విద్యార్థిని తెప్ప అమృత అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్ కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, జి.గోపాలకృష్ణ, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త

**మెళియాపుట్టి, జనవరి 3(వార్త):** సావిత్రీబాయి పూలే గొప్ప సంఘసంస్కర్తని గిరిజన సంఘ నాయకులు, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి అన్నారు. మెళియాపుట్టిలోని ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రీబాయి అణగారిన మహిళలు, ప్రజలకు ఆశాజ్యోతిగా నిలబడ్డారన్నారు. సమాజం ముందుకు నడవాలంటే మహిళాలకు విద్య అవసరమని చెప్పిన తొలి ఉపాధ్యాయుని సావిత్రీబాయి అన్నారు. కార్యక్రమంలో దీనబంధుపురం సర్పంచ్ ప్రతినిధి సవర వెంకటేష్, ముకుందపురం సర్పంచ్ సవర భాస్కరరావు, గొందర లక్ష్మణరావు, ఎస్.గణేష్, ఆంపురం సర్పంచ్ డి.జమ్మయ్య, మాజీ సర్పంచ్ సవర వర్మ, గొట్టిపల్లి సర్పంచ్ గొల్ల జనార్ధనరావు, యువకులు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా సావిత్రీభాయి పూలే జయంతి



### ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం..

**పలాస, జనవరి 3(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే జయంతిని పురస్కరించుకొని మహిళ ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి మాట్లా డుతూ ఆడపిల్లలు మానసిక, శారీకంగా బలంగా ఉన్నప్పుడే సమాజాన్ని ఉన్న తంగా నిర్మించగలరన్నారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ విభాగ అధ్యాపకురాలు ఏ సునీత మాట్లాడుతూ అమ్మాయిలు, అబ్బాయిలతో పోటీపడి అన్ని రంగాల్లో దూసు కుపోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకురాలు దీపాకుమారి మహిళా సాధికారత విభాగం సభ్యురాలు రోజారాణి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

**వంగర, జనవరి 3(వార్త):** ఆదర్శ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా వంగర మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో మొదటి మహిళ ఉపాధ్యాయుని సావిత్రీబాయి పూలే ఎన్నోసేవలు అందించారని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు దళిత బహుజనులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మజ్జి గణపతి, వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ముద్దాడ రమణమ్మ, రాష్ట్ర అవార్డు గ్రహీత, ఇంగ్లీష్ టీచర్ సూర జయకృష్ణ, దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్య దర్శి. ఎం.గణపతిరావు, ఆర్ఐ రామారావు మాట్లాడుతూ సావిత్రీబాయిపూలే బడుగు, బలహీన వర్గాలకు చేసిన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో జీకే నాయుడు, దళిత బహుజన నాయకులు గంగులు, అప్పలస్వామి బుజ్జి, మన్మధరావు, డర్రు రాం బాబు, రాజు, జి.గణపతి, సుధీర్, చిన్న ,దివాకర్, టీ.సింహాచలం, రామారావు, ఎం.రాంబాబు, అప్పలరామ్, దాలి రాము, రమేష్, తవిటినాయుడు, సాయి, ఉదయ్ రామ్, వై.సింహాచలం, దళిత బహుజన నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ సహాయకులకు దరఖాస్తు చేసుకోండి

**మందస, జనవరి 3(వార్త):** గిరిజన ప్రాంతాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన అభ్యర్థినులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కె.వసంధరాదేవి తెలిపారు. బలరాంపురం, బురసాయి, గోపిటూరు, చాపరాయి, దాలసరి, సవరమధ్య, సవర రాజపురం కేంద్రాలకు సంబంధించి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఈనెల 10లోగా దరఖాస్తులు మందస కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలి

**పలాస, జనవరి 3(వార్త):** పలాస నియోజకవర్గ పరిధిలోని పలు పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్‌ను కోరారు.

విజయవాడ వాల్ కమిటీ హాల్‌లో శుక్ర వారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పలాస ప్రాంతంలో జీడి పరి శ్రమలతో పాటు పలు కుటీర పరిశ్రమలు ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలు కూడా వస్తాయని తెలిపారు.

ఈ పరిశ్రమల ద్వారా జరుగుతున్న



ఎగుమతుల, దిగుమతులు, వీటి అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పరిశ్రమలు మరింతగా అభివృద్ధి చెందేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.

## మణిపాత్రునికి రోటరీ నేషనల్ బిల్డర్ అవార్డు

**పోలాకి, జనవరి 3(వార్త):** కళాకారుడు, సామాజిక చైతన్యం, విద్య, సినిమా రంగాల్లో విశేష సేవలందించిన మణిపాత్రుని నాగేశ్వరావుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రోటరీ నేషనల్ బిల్డర్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగేశ్వరరావు కృషికి ఈ అవార్డు ఒక దర్పణం వంటిదని ప్రశంసించారు.



ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇది తనకు 960వ సన్మానం అని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆముదాలవలస అధ్యక్ష, కార్యదర్శులు పి.తేజలక్ష్మి, జేకే రవిబాబు, జేకే వెంకుబాబు, ఎంసీఏ కార్యదర్శి ఎం.తిరుమల పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేటి నుంచి కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

**శ్రీకాకుళం, జనవరి 3 (వార్త):** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు కానుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను విద్యాశాఖ జారీ చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 38 మండలాల్లో జూనియర్ కళాశాలల్లో అమలు చేయనున్నారు. 11,028 మందికి ప్రయోజనం కలగనుంది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పథకాన్ని అమలు చేయడానికి ఉన్నత పాఠశాలల్లో వంట నిర్వహిస్తున్న ఏజెన్సీలను కేటాయించారు. ఆమదాలవలస, తొగరాం, నరసన్నపేట, కళింగపట్నం, టెక్కలి, కింతలి, కోటబొమ్మాళి, శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలకు అక్షయపాత్ర నుంచి భోజనం సరఫరా చేస్తారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని డీవీఈవో ఎస్.తవిటినాయుడు తెలిపారు.

### ప్రశాంతంగా మహిళ అభ్యర్థులకు..

# దేహదారుఢ్య పరీక్షలు

*** 118 మంది మహిళ అభ్యర్థుల అర్హత**

*** పర్యవేక్షించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి**

**శ్రీకాకుళం క్రైం, జనవరి 3 (వార్త):** ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు పోలీసు కానిస్టేబుల్ నియామక పక్రియలో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి మహిళ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన మహిళ అభ్యర్థులకు ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు,ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో శుక్రవారం దేహ దారుఢ్య పరీక్షలను ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పర్యవేక్షించారు. శుక్రవారం 587 మంది మహిళ అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 317 మంది పాల్గొన్నారు. వీరిలో 118 మంది అభ్యర్థులు క్వాలిఫైడ్ అయ్యారు. వీరందరికీ శుక్రవారం ఉదయానికి ప్రణాళిక బద్ధంగా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, బరువు, 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు మహిళ అధికారులు సమక్షంలో యదవిధంగా పకడ్బందీగా నిర్వహించారు.







## ఇటుకల బట్టీల జీవోలో ఏముంది?

*** రూల్స్ పాటిస్తే ఒక్క బట్టీ కూడా నిలవదా? * మూడు బట్టీలు ఆరు చిమ్నీల్లా సాగుతున్న వ్యాపారం * మూడు నెలలు కష్ట పడితే ఏడాది ఆదాయం * నిబంధనలు పాటించకుండా బట్టీల నిర్వహణ * కొందరు అధికారులకు మామూళ్లు**

**శ్రీకాకుళం క్రైం, జనవరి3 (వార్త):** ఇచ్చాపురంలో ఇటుకలు బట్టీల వ్యాపారం 3 బట్టీలు, 6 చిమ్నీల మాదిరిగా సాగుతోంది. నిర్మాణ రంగానికి ఇటుకలు కీలకం. దీంతో బట్టీల నిర్వాహకులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. అసలు జీవో 80 ఏమిటి, పర్యావరణ అటవీశాఖ 2010లో జీఓ 80 విడుదల చేసింది. అన్ని బట్టీలు అందులో పొందుపరిచిన నింబంధనలు మేరకు కచ్చితంగా పాటించ వలసిందే. జనావాసాలకు, ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు ఒక కిలోమీటర్ దూరంలో, వ్యవసాయభూములకు, ఉద్యాన వన పంటలకు కనీసం వంద మీటర్ల దూరంలో, వరద గట్టుకు 100 మీటర్ల దూరంలో ఉండాలి. జాతీయ రహదారి, రాష్ట్ర రహదారి, రింగ్ రోడ్డులకు 200 మీటర్ల దూరంలో ఉండాలి. గ్రామీణ రోడ్ల కు 25 మీటర్ల దూరంలో ఉండాలి. ఇటుకలు తరలించేందుకు వచ్చే వాహనాలు రవాణాకి ఇబ్బందులు లేకుండా ఉండాలి. ఇటుకలు కాల్పులు జరిపిన తర్వాత వచ్చే బూడిదని వేరే చోట నిల్వ చేసేందుకు ఏర్పాటు చేయాలి. వ్యవసాయ భూములకి ఎటువంటి ఆటంకం లేకుండా ఉండాలి.ఈ మేరకు పరిశ్రమల శాఖ, రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ చేయాలి. అయితే ఇచ్చాపురంలో మాత్రం ఈ నిబంధనలు ఏవీ కూడా పాటించడం లేదు. ఇటుకలు కాల్చగా వచ్చే పొగతో స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. అక్కడ పనిచేసే గిరిజన కార్మికులకు సైతం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. ఇక్కడ పనిచేసే కొందరు కార్మికులు ఇటీవల అనారోగ్యానికి గురికావడం, నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో వారు వారి సొంతూళ్లకు వెళ్లిపోయారు. కాల్పుల తర్వాత వచ్చే బూడిదను ఆ సమీపంలోనే బాహుదా నదిలో పడబోస్తున్నారు. దీనివల్ల నదిలో అంతంత మాత్రంగా ఉన్న నీరు కలుషితమైపోతోంది. నిర్వాహకులు పట్టించుకోవడం లేదు సరే.. మరి అధికారులు ఏం చేస్తున్నారో అన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిబంధనలు పట్టించుకోకపోయినా, కార్మికులు వ్యాధుల బారిన పడుతున్నా, నదీజలాలు విషతుల్యం అవుతున్నా మండల అధికారులు చోద్యం చూస్తుండడం వెనుక.. వారికేమైనా కాసులు అందుతున్నాయా అన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ ఇటుకల బట్టీపై స్థానికులు కొందరు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

## విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోండి

*** ఎమ్మెల్యే కూన రవికుమార్ * విద్యార్థుల బోధన సామర్థ్యం పరిశీలన * హైస్కూల్, కళాశాలల సందర్శన**

**ఆమదాలవలస, జనవరి 3 (వార్త):**పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలను సొంత బిడ్డల్లా చూసుకోవాలని ప్రభుత్వం కేటాయించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ జ్యోతిబా పూలే, హైస్కూల్, కళాశాల ప్రిన్సిపల్ జి.వాసుదేవరావుకు సూచించారు. శుక్రవారం పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఎమ్మెల్యే రాకతో స్థానిక టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పరుగులు తీశారు. పాఠశాలను తనిఖీ నిర్వహించిన ఎమ్మెల్యే రవికుమార్ కళాశాల హాజరు పట్టి, విద్యార్థుల వివరాలు తరగతి వారీగా అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థినులతో మాట్లాడి వారిలో ఉన్న ప్రతిభను తెలుసుకునేందుకు పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుని వలె విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి తల్లిదండ్రులను విడిచిపెట్టి చదువుకునేందుకు పాఠశాలకు ఆడపిల్లలు వచ్చారని వారిని జాగ్రత్తగా చూడాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థ మయ్యే విధంగా బోధన చేపట్టాలని గ్రేడ్లు వారీగా విభజించి బోధించాలన్నారు. వసతి సమస్యపై ఆరా తీశారు. శాశ్వత భవనాలు నిర్మాణాలకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. నాడు ప్రభుత్వ విప్ గా ఉన్న సమయంలో ఈ పాఠశాలను మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాళ్లవలస వద్ద శాశ్వత భవన నిర్మాణానికి సంకల్పించామని 2019 తర్వాత అధికారం చేపట్టిన వైసిపి భవన నిర్మాణం విషయం మర్చిపోయిందని అన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పాఠశాల, కళాశాల భవనాలు నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ విద్యార్థినులకు స్వీట్లు పంచిపెట్టారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546